"ఆగండి! మీకు పర్మిషను ఇవ్వలేదు. రూములో నుంచి వెళ్ళమని..."

"వచ్చేప్పుడు పీచు మిఠాయి తెస్తాం లెండి. టా .... టా."

"ఇదిగో -- మర్యాదగా ఆగండి! నాక్కోపం వస్తే ఏం చేస్తానో తెలుసా?"

"తెలుసు! కుక్కలా మొరుగుతావ్?" అంటూ కిటికీ బయట నుంచి మళ్ళీ గొంతు వినిపించేసరికి రామలింగం మళ్ళీ చిరుతపులిలాగా కిటికీ దగ్గరకు దూకాడు.

కానీ క్షణం అలస్యం అయింది. ఖాళీ వరండా వెక్కిరించింది.

******

"అడిగో అతనేనే" అంది రాధ. గాంగ్ మొత్తం ఆగిపోయింది. మొత్తం ఆరుగురు అమ్మాయిలు.

ఎదురుగా మురళి నడుచుకుంటూ వస్తున్నాడు. అవతలివాళ్ళు ఒకరికన్నా ఎక్కువ వుంటే సాధారణంగా ఆడపిల్లల్ని తలెత్తి చూడడం అదీ గాక ఇప్పుడు అతడు మంచి మూడ్‌లో లేడు. అతడి పేరు మీద ఆ ఆగంతకుడు పోస్ట్‌మాన్ దగ్గిర సంతకం పెట్టి (ముమ్మూర్తులా తనలాగే) మనీఆర్డర్ తీసేసుకున్నాడు.

తల వంచుకుని నడవటానికి అది కూడా ఒక కారణం.

"చూస్తావేమిటే" అంది రాజేశ్వరి.

మిగతా వాళ్లందరూ జరగబోయేదానికోసం ఎదురు చూస్తూ మౌనంగా వున్నారు.

రాధకు వణుకు పుట్టుకొచ్చింది.

"అడుగో వచ్చేస్తున్నాడు" అంది శాంత.

అందరి కళ్ళూ అతని మీదకు మళ్ళినయ్.

"అతన్ని 'ఏమండీ!' అంటూ పిలు! దగ్గరకొచ్చాక చెంప ఛెళ్ళుమనిపించు --" రాధ చెవిలో చెప్పింది జానకి.

రాధ భయంగా అతనివేపు చూసింది. అతను వాళ్ళు నుంచున్న వరండా దగ్గరగా వచ్చేశాడు.

"ఊ?" రాధ భుజం మీద ఒక్క పోటు పొడిచింది శాంత.

"ఏవండీ!" అని పిలిచింది రాధ వణుకుతున్న స్వరంతో.

మురళి ఠక్కున నిలబడిపోయాడు. ఆ అమ్మాయెవరో పిలుస్తోంది తననా కాదా అన్న అనుమానం వచ్చింది.

"మిమ్మల్నే" అంది రాధ మళ్ళీ శ్యామల ఓ పోటు పొడవగానే.

మురళీకేమీ అర్థం కాలేదు.

"నన్నా" అంటూ ఆమె వేపు రెండడుగులు వేశాడు.

అంతే! ఆమె ఓ అడుగు ముందుకేసి అతని చెంప ఛెళ్ళుమనిపించింది.

"లేకపోతే ఒంటరిదాన్నీ అమాయరాలినీ చేసి రోడ్డుమీద అల్లరి పెడతావా? ఏదీ ఇప్పుడెయ్ నీ హీరో వేషాలు, చూద్దాం!" అంది శ్యామల.

అమ్మాయిలు వెళ్ళిపోయారు.

మురళి ప్రతిమలా నిలబడిపోయాడు.

3

"రాధా!" అన్నాడు మురళి కిటికీలోంచి శూన్యంలోకి చూస్తూ.

తరువాత తల మరింత పైకి ఎత్తి. ".... రాధా" అన్నాడు మరొకసారి.

పక్కనే పక్కమీద పక్కకి తిరిగి పడుకుని డిటెక్టివ్ నవల చదువుతూన్న కనకారావు పుస్తకం పక్కన పడేసి మురళి పక్కకి తిరిగి, "ఒరేయ్! నక్కలా మోర పైకెత్తి అరిగిపోయిన రికార్డులా అలా 'రాధా రా....ధా' అని అరవకు" అన్నాడు విసుగ్గా.

"నా గుండెల్లో లావాలా నిక్షిప్తమైవున్న ప్రేమ ఆమె చెంప దెబ్బతో పెఠాలున బ్రద్దలయింది. ప్రేమ నన్ను ముంచేస్తుంది. ఆ చేతి దెబ్బ.... ఆమె చెంపదెబ్బ... అబ్బా!" అన్నాడు (చదువరీ! ఇక్కడ 'అబ్బ' అను పదము బాధను సూచించునది కాదు! తాదాత్మ్యతను సూచించునది.)

"అయితే ఏమిటంటావు?"

"ఆమెని వివాహం చేసుకోని జీవితం వ్యర్థం..."

విన్సెంట్ లేచి మురళి దగ్గిరగా వచ్చాడు. అతడికి హస్తసాముద్రికం పిచ్చి వుంది. జేబులో ఎప్పుడూ భూతద్దాన్ని వుంచుకుంటాడు.

దాన్ని మురళి చెంపమీద పెట్టి పరీక్షగా చూస్తూ "చేసేసుకోవచ్చు గురూ! అమ్మాయి అదృష్టరేఖ   జెర్రిపోతులా స్పష్టంగా కనిపిస్తోంది" అన్నాడు "అంతేకాదు. తొందర్లో వివాహం అయ్యే యోగం కూడా కనపడుతూ వుంది."

"ఒరే! నిన్ను చంపేగల్ను" కోపంగా అన్నాడు మురళి.

విన్సెంటు చెంపని మరోమారు చూసి "లాభం లేదు గురూ! ఆ అమ్మాయి భర్త హంతకుడు అయ్యే యోగం చేతి రేఖల్లో కనపడటం లేదు" అన్నాడు అదే స్వరంతో.

ఇంతలో కనకారావు పక్కమీద లేచి కూర్చుంటూ "నిన్నటి వరకు బాగానే వున్నావు కదా! ఈ రోజు ఇలా అయిపోయావేమిట్రా" అని అడిగాడు మురళిని.

"ఎలా అయిపోయాను?"

"ప్రతిదానిపట్లా నిర్లిప్తత, నిరాసక్తక, స్థబ్దత, నిర్విణ్ణత, అప్పుడప్పుడు షాక్ తగిలినట్లు వుండటం.... అచేతనుడవటం..."

మురళి విరక్తిగా నవ్వి "పిచ్చివాడా! అవన్నీ ప్రేమ తాలూకు విశేషణాలు" అన్నాడు ఉలిక్కిపడి.

"ఉలిక్కి పడ్డావెందుకు? అది కూడా ప్రేమ తాలూకు ఒక విశేషణమా?" అని అడిగాడు

కనకారావు.

"కాదు. కిటికీ పక్కనే నిలబడి వార్డెను మన మాటలన్నీ వింటున్నాడు" అన్నాడు మురళి స్టిఫ్‌గా.

విన్సెంటు వెనక్కి తిరక్కుండానే, "వాడి మొహం! వాడొకతొండ, గొంగళి పురుగు, రాజకీయ నాయకుడు, మంత్రి, ఊసరవెల్లి, సీతాకోక చిలుక..." అంటూ వుండగా రామలింగం ఇక కోపం పట్టలేక. "ఏయ్!" అంటూ లోపలకు దూకాడు.

"మీరా సార్! రండి. ఏమిటిలా దయచేశారు?"

"మీరన్న మాటలన్నీ విన్నాను. సస్పెండ్! మిమ్మల్ని ముగ్గురినీ సస్పెండ్ చేసేస్తాను."

"ఎందుకు సార్! ఏమన్నాడు వాడు? తొండ, గొంగళిపురుగు, రాజకీయ నాయకుల్లాంటివి , మంత్రి అవగానే రంగులు మార్చేస్తాయి అంటున్నాడు. అంతే గదరా."

"మరే!" అంటూ వత్తాసు పలికాడు కనకారావు.

రామలింగం మరింత పెట్రేగిపోయి "వాడొక తొండ -- అన్నాడు 'వాడు' అంటే నేనే" అన్నాడు.

"నిశ్చయంగా పొరపాటు పడ్డారు. 'వాడొక' కాదు 'వాడుక' వాడుక అంటే -- అలవాటు -- అని అర్ధం. వాడుకగా తొండ, ఊసర...."

రామలింగం మరి కోపం పట్టలేక, "వాడి మొహం అనికూడా అన్నాడు" అని అరిచాడు ఉక్రోషంగా ఏడుపొక్కటే తరువాయిగా.

మురళి నమ్రతగా "మళ్ళీ పొరపాటే! వాడిమొహం అంటే వాడి అయిన మొహం. శివుడి మూడో కన్ను వుంటుంది చూడండి -- సీరియస్‌గా -- అలా అన్నమాట," అన్నాడు.

"అంతేనా!"

"అంతే."

"సీరియస్‌గా అంతేనా?"

"అంతే సార్. నమ్మండి."

"అంతే నంటావ్."

ముగ్గురూ తలూపారు.

రామలింగం బయటకు వెళ్ళబోయి ఆగి, అనుమానంగా "మరేదో ప్రేమ అంటున్నావ్ నువ్వు..." అన్నాడు మురళితో.

"అబ్బే. ఏం లేదు సార్. ప్రేమంటే.... అదే.... రవీంద్రనాథ్‌ఠాకూర్, మదర్ థెరిస్సా -- వాళ్ళ గురించి చర్చించుకుంటున్నాం."

'దొరికార్రా' అనుకున్నాడు రామలింగం తన మనసులో. ఇన్నాళ్ళకి వీళ్ళ వీక్ పాయింటు దొరికింది! ఇప్పటి వరకూ తనని ఆడించేశారు. ఇక వీళ్ళని ఆడిస్తాను. ఒకవేళ

"ప్రేమ గురించి మీకేం తెలుసు పిల్లకుంకలూ" అన్నాడు.

ముగ్గురూ మొహమొహాలు చూసుకున్నారు. రామలింగం విజృంభించేశాడు. "నేను కాలేజీలో చదువుకునే రోజుల్లో సగటున రోజుకి ఇద్దరు అమ్మాయిల దగ్గిర్నుంచి ప్రేమలేఖలు అందుకునే వాడిని."

"ఎలా సార్! ఆనరరీ పోస్ట్‌మాన్ పనిచేసేవారా."

"ఛత్. అమ్మాయిలు అంతలా ప్రేమించేవారన్నమాట! అసలు ప్రేమించటం, అమ్మాయిల ప్రేమ పొందటం ఒక కళోయ్! అందరికీ సాధ్యం కాదు. అసలింతకీ ఆ అమ్మాయి ఎవరు? ఎలా పరిచయం పెరిగింది, ఆ విషయాలన్నీ చెప్పు" అన్నాడు విశాలంగా నవ్వుతూ.

అతడికి 'యమ' ఆనందంగా వుంది. హాస్టల్లో ఈ మూడు కోతుల్నీ తన ఆధీనంలోకి తెచ్చుకుంటే మిగతా అందర్నీ ఒక ఆట ఆడించెయ్యొచ్చు మిగతా అదర్నీ ఒకఆట ఆడించెయ్యొచ్చు తన ఆధీనంలోకి తెచ్చుకుంటే మిగతా అందర్నీ ఒక ఆట ఆడించెయ్యొచ్చు.

"అసలు మనవాడు ప్రేమలో పడటానికి మీరే కారణం సార్" అన్నాడు విన్సెంటు.

రామలింగం అదిరిపడి "నేనా" అన్నాడు.

"నిశ్చయంగా మీరే!" అని కనకారావ్ వైపు తిరిగి "చెప్పరా" అన్నాడు

అసలు జరిగింది ఇది.

4

"మనదీ వుంది వెధవ లైఫ్ .... ఆ కుర్రవాళ్ళని చూడండి స్టూడెంట్ లైఫ్ అంటే అలా వుండాలి." అమితాబ్ బచ్చన్ -- నలుగురూ మార్నింగ్ షో నుంచి వస్తున్నారు.

"నిజంగా. భలే పందెం గురూ ఆ సినిమాలో..." అన్నాడు విన్సెంటు.

"సాయంత్రం నుంచీ ప్రొద్దున్న వరకూ, లేడీస్ హాస్టల్లో ఒక రాత్రంతా గడిపి రావటం పందెం. అక్కడ జరిగిన గొడవా, వార్డెన్ పోలీసులకి ఫోన్ చేయటం. బాత్‌రూముల్లో ఛేసింగూ, కిచెన్‌లో వంకాయల గుట్ట వెనుక దాక్కోవటం -- అంతా గోలగోల."

"మనం అనుకోవాలే గానీ అంతకన్నా సాహసాలే చేయొచ్చు" అన్నాడు మురళి.

"ఏది నువ్వా, మొహం చూపించు."

"చేసి చూపిస్తే"

"బ్రహ్మాండమైన పార్టీ ఇస్తాను -- ఇంతకీ ఏం చేస్తావు?"

"మన ఎదురు హాస్టల్లో ఎవరో ఒక అమ్మాయిచేత -- తన స్వంత డబ్బులతో ఇప్పించుకుని డ్రింకు తాగుతాను" అన్నాడు మురళి పందెం కాస్తున్నట్టు.

"మీ మరదలు ఎవరయినా వుందా గురూ?" అనుమానంగా అడిగాడు అమితాబ్ బచ్చను.

"కాదు. మీరెవర్ని చూపించినా సరే...." అంటూ సవాలు చేశాడు మురళి.

మరుసటి రోజు మధ్యాహ్నం దారి కాశారు నలుగురూ. ఎదురుగా ఒక అమ్మాయి

మందాన పసుపు రాసింది. పెద్ద బొట్టు పెట్టింది. దుప్పటంత మందం చీరె కట్టింది. అంతా కలిపి పాతకాలం నాటి కుందనపు బొమ్మలా వుంది.

ఎండ బాగా ఎక్కువగా వుంది. వీధి నిర్మానుష్యంగా వుంది. దూరంగా ఎక్కడో కాకి అరుస్తోంది.

మురళి ముందుకెళ్ళాడు. ఆమె సమీపానికి వచ్చాక "బిరుషోమి! బిస్తినా -- కమిరిషోన్" అన్నాడు. ఆ అమ్మాయి బెదిరిపోయింది. చేతిలో పుస్తకాలు జారిపోయినంత పనైంది. ఆ పెద్ద పెద్ద కళ్ళలో భయం స్పష్టంగా కనిపించింది.

"బిరుషోమి -- బిస్తినా -- కమిరిషోన్" అన్నాడు మళ్ళీ.

కాలేజీలో చదువుతున్నదన్న మాటేగానీ ఆ అమ్మాయితో ఒక పరాయి పురుషుడు మాట్లాడటం అదే మొదటిసారి. పరాయి పురుషులు అంటే -- కేవలం రిక్షా వాడు, పాలవాడు, పేపరు కుర్రవాడు, ఒకసారెప్పుడో ఇంగ్లీషు లెక్చరరు -- వీళ్ళే మాట్లాడారు అప్పటి వరకూ.

ఆమె భయంతో "ఏ...ఏ.... ఏమిటి" అంది.

"బిరుషోమి! కమిరీషాన్! మిషికీషీ" అన్నాడు మురళి.

"వాడూ యు వాంట్ ?" అంది కాస్త ధైర్యం తెచ్చుకుని ఇంగ్లీషులో.

"బిరుషోమీ."

"హిందీ జాన్తే" అని ప్రశ్నించింది.

"కమిరిషోన్"

"ఎన్న భాషప్పా ఇది..."

"మిషికీషీ."

అప్పుడే అటు పోతున్న కనకారావు ఆగి, వాళ్ళ అవస్థ చూడజాలి పడుతున్నట్టు "ఏమిటండీ?" అన్నాడు.

"ఏమిటో అడుగుతున్నాడండీ ఇతను. నాకేమీ అర్ధం కావడం లేదు" అంది రాధ. కనకారావు 'ఏమిట' న్నట్టు చూశాడు.

"బిరుషోమీ! కమిరిషోన్! మిషికీషీ" అన్నాడు.

"అదన్న మాట సంగతి" అన్నాడు కనకారావు అర్ధమైనట్టు తరువాత రాధ వేపు తిరిగి, "ఇది థార్ ఎడారి ప్రాంతపు భాషండీ, పాపం ఇతని పర్సు ఎవరో కొట్టేశారుట. ఇంటికి చేరుకోవటానికి అయిదు రూపాయలు కావాల్ట" అన్నాడు.

ఆమె జాలిగా పర్సులోంచి అయిదు నోట్లు తీసి యిస్తూ "అయిదు రూపాయల్తో పాపం అంత దూరం ఎలా వెళతాడండీ ? థార్ ఎడారి అంటే చాలా దూరం కదా?" అంది.

కనకారావు అతడి వేపు తిరిగి "బిక హో మా మానుంగి టాన్సే" అన్నాడు.

"కమిరిషో మద్రింక బిటకనిపూ."